కథానిక — మల్లాది వెంకటకృష్ణమూర్తి

# విమానం ఎక్కి చూడు

**హాస్య శృంగార రసాలకు పెద్దపీట వేసే మల్లాది నవలలు, కథలు పాఠకులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆయన అభిమానుల సంఖ్య అసంఖ్యాకం.**

ఎప్పుడయినా దారి తప్పి మా ఊరి మీదుగా విమానం ఎగురుతూ వెళ్తుంటే పిల్లలమంతా బయటికి వచ్చి తలెత్తి ఆకాశంలో ఎగిరే ఆ మరపిట్టని చూస్తూ 'టాటా... టాటా' అని చేతులూపుతూ అరిచేవాళ్ళం.

"చేతిలో చక్రం ఉంటేగానీ విమానం ఎక్కలేర్రా ఎవరూ" అనేవారు మా నాన్నగారు. అంతా చేతులు చూసుకునేవాళ్ళం, చక్రాలు కనబడతాయేమోనని. 'నాకుంది, నీకు లేదు' అని పిల్లలమంతా జాతకాలు చెప్పుకునేవాళ్ళం.

ఎప్పుడూ విమానం ఎక్కనివాళ్ళకు అదెక్కడమంటే ఎంతో సరదాగా ఉంటుంది. కానీ, ఓసారి ఎక్కాక గాని అదెలా ఉంటుందో చాలామందికి తెలీదు.

నేను ఆగస్టు, 1990లో విమానంలో అమెరికాకు ప్రయాణం అయ్యాను. ఆరోజు నా విమాన ప్రయాణం అనుభవాలు విన్నవిస్తాను. చిత్తగించి, మీకు విమానం ఎక్కాలన్న కోరిక ఇంకా ఉందో లేదో తేల్చుకోండి.

బాంబే నుండి లండన్ మీదుగా న్యూయార్క్ వెళ్ళే విమానం ఎక్కడానికి బాంబేలోని అంతర్జాతీయ విమానాశ్రయం సహార్ ఎయిర్‌పోర్టుకి రాత్రి పదకొండు గంటలకు మా ఆవిడతో చేరుకున్నాను. నిజానికి నాకు విమాన ప్రయాణం గిట్టదు. 'దేవుడు పక్షులకు రెక్కలిచ్చి మనుమలకెందుకు ఇవ్వలేదు? వాటిలా మనిషి గాల్లోకి ఎగరకూడదనేగా? అందుకే మనిషి గాల్లో ఓ మరపిట్ట పొట్టలో కూర్చుని ఎగరడం దేవుడికి గిట్టదు అన్నది నా నమ్మకం. అందుకనే విమానాలు కూలుతుంటాయి అన్నది కూడా నా నమ్మకం.

సరే. ఎయిర్‌పోర్టుకి చేరుకున్నాక విమానం టికెట్ అమ్మే క్యూలో నిల్చుని నా ముందున్న వ్యక్తిని అడిగాను 'న్యూయార్క్ వెళ్ళే విమానం టికెట్లమ్మే కౌంటరేనా' అని. అవునన్నాడు ఆ భారీ శాల్తీ. నా ముందున్న వాడు టికెట్ కొన్నాక నేను న్యూయార్క్‌కి రెండు టికెట్లిమ్మని అడిగాను. "విండో సీట్ కావాలా?" అడిగాడతను.

"వద్దు. ఎయిర్‌హోస్టెస్ దగ్గరగా ఉండే సీట్ ఇవ్వండి చాలు." మా ఆవిడ వినకుండా గొంతు తగ్గించి చెప్పాను రహస్యంగా. మా ఆవిడ ఓ అనుమానాన్ని ఇంటి దగ్గరే వ్యక్తం చేయడంతో అడిగాను కౌంటర్‌లోని వ్యక్తిని.

"మా విమానం పైలట్ బాగా అనుభవం ఉన్నవాడేగా?" అడిగింది మా ఆవిడ. తొలి విమాన ప్రయాణం ఎవరికయినా భయమేగా!

"అనుభవజ్ఞుడే. దారిలో తుపాను గానీ, పెనుగాలులు గానీ రాకపోతే..." చెప్పాడతను. నాకు పిరికితనం అననుగానీ, ఏ నట్టో, బోల్టో లూజయితే బస్సో, రైలో అయితే దిగి నడుచుకుంటూ వెళ్ళిపోవచ్చు. లేదా అది డ్రయివర్ రిపేర్ చేసేదాకా ఆగచ్చు. కానీ, విమానానికి అలా కుదరదు కదా! అలా జరిగితే దానికిందేమీ రోడ్డు లాంటిది ఆవడానికి ఉండదు కాబట్టి, అది దబ్బున కూలుతుంది. అందుకే అడిగానతన్ని. "ఇది ఏ టైపు విమానం?"

"జంబో జెట్. ఏం?" అడిగాడు.

"పేపర్లో చూస్తుంటాను. తరచు కూలేవి ఈ టైపు కాదుగా?" అడిగాను.

"తరచూనా!" అని కొన్ని క్షణాలు ఆలోచించి తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"ఊఁహూఁ.. ఒకే ఒక్కసారి కూలుతాయి. ఆ తర్వాత అవి పనికిరావు."

"ఇది న్యూయార్క్ చేరడానికి ఎంత టైం పడుతుంది?" అడిగాను.

"ఫార్టీ సెవెన్ డౌన్ కదా మీది? ఇరవై మూడు గంటలు." చెప్పాడు.

'డౌన్' అన్న పదం వినగానే మా ఆవిడకు గాబరా పుట్టింది.

"మధ్యలో డౌన్‌లో కూలదు కదా?" గొణిగింది నా చెవిలో.

"'ఫార్టీ సెవెన్ అప్' అంటే న్యూయార్క్ నుంచి తిరిగి వచ్చేది. 'ఫార్టీ సెవెన్ డౌన్' అంటే న్యూయార్క్ వెళ్ళేది." చెప్పాడతను ఆ మాటలు విని. "మమ్మల్ని న్యూయార్క్ వెళ్ళే విమానంలో, మా సామాను టోక్యో వెళ్ళే విమానంలో బుక్ చెయ్యండి." చెప్పాను నేను. కౌంటర్‌లోని వ్యక్తి ఆశ్చర్యంగా చూసి అడిగాడు:

"మీ సామాను టోక్యోకి బుక్ చేయాలా?" "అవును."

"అది అసాధ్యం. మీరు న్యూయార్క్‌కి వెళ్తుంటే రూల్ ప్రకారం మీ సామానూ న్యూయార్క్‌కే పంపాలి."

"మరి పోయినసారి నేను రోమ్ వెళ్తుంటే నా సామాన్ని నాతోపాటు రోమ్‌కి కాకుండా పేరిస్‌కి పంపారుగా?" అడిగాను.

ఓసారి ముక్కు గోక్కుని తల అడ్డంగా ఊపి చెప్పాడు:

"ఊఁహూఁ. న్యూయార్క్‌కే మీ సామాను బుక్ చేయాలి."

"నాక్కావలసిందీ అదే. ఆ సంగతి గట్టిగా గుర్తుంచుకోండి." చెప్పాను.

"భలే కొట్టారు." మా ఆవిడ నాతో అంటే గర్వంగా ఫీలయ్యాను.

ఇద్దరం సెక్యూరిటీ చెక్ లోంచి వెళ్ళాం. ఆయుధాలు, బాంబులు ఉన్నాయేమోనని సెక్యూరిటీ గార్డ్ నా ఒంటినంతా తడుముతుంటే అతను డ్యూటీని సిన్సియర్‌గా చేసే సెక్యూరిటీ గార్డా లేక ఇంకెవరైనానా అన్న అనుమానం కలిగింది. మా ఆవిడ కూడా నాలాగే సిగ్గుపడుతూ బయటికి వస్తుంటే నా కోపాన్ని మా ఆవిడ మీద చూపించేను. "ఏం చేశాడు వాడు?"

"ఇంకా నయం. వాడు కాదండి. అది ... అదే..." చెప్పింది మా ఆవిడ.

గుడ్డిలో మెల్ల. ఇద్దరం లాంజ్‌లో కూర్చున్నాం. ఓ ఇంగ్లీష్ అమ్మాయి ఏర్ బాగ్ మీద 'సెక్స్' అని ఇంగ్లీష్‌లో రాసుంది. "నిజంగా?" అడిగాను మా ఆవిడ బాత్రూంకి వెళ్ళగానే.

"సిల్లీ. కాదు. నా ఇనీషియల్స్ అవి. నా పేరు సుసాన్ ఎలైన్ జేవియర్." చెప్పిందా అమ్మాయి, తన తేనెకళ్ళతో నావంక చూస్తూ. పది నిమిషాల తర్వాత టికెట్లకు ఇద్దరికీ ఎంతయిందో చూసుకుని చెప్పాను మా ఆవిడతో.

"విమానం ప్రపంచాన్ని ఎంతో చిన్నదిగా చేసిందంటారు. కానీ, అది టికెట్ ధరను మాత్రం ఎంతో పెద్దది చేసింది."

విమానం సిద్ధంగా ఉందని, మమ్మల్ని ఫార్టీ సెవెన్ డౌన్ ఎక్కమని ప్రకటన విన్పించాక లేచి విమానం వైపు బయల్దేరాము.

ఒకతను భుజాలకు ఏదో తమాషాగా కట్టుకుని ఉండటం గమనించి అడిగాను అదేమిటని.

"దీన్ని పేరాచూట్ అంటారు." చెప్పాడు అతను. "మీరెక్కడికి?" అడిగాను.

"ఇంకెక్కడికి? న్యూయార్క్‌కి. నేను లేకపోతే మీరు ఎవరూ న్యూయార్క్‌కి వెళ్ళలేరు. నేనే ఈ విమానం పైలట్‌ని." చెప్పాడతను చిన్నగా నవ్వి.

మాతో నడుస్తున్న ఒక ప్రయాణికుడు ఠక్కున వెనక్కు తిరిగి మరల ఏర్‌పోర్ట్ బిల్డింగ్‌లోకి వెళ్ళిపోతుంటే అతన్ని ఆపి అడిగాను, "ఏదయినా మర్చిపోయారా" అని.

"లేదు. ఇప్పటికిప్పుడు ఈ విమాన ప్రయాణం మానుకున్నాను." చెప్పాడు.


"ఏం?" అడిగింది మా ఆవిడ ఆసక్తిగా.

"నేను పోయినసారి న్యూయార్క్ వెళ్ళినప్పుడు వచ్చిన పైలట్ ఇతనే. నా టికెట్ కేన్సిల్ చేసుకుంటున్నాను." చెప్పాడు అతను కంగారుగా.

నేను, మా ఆవిడ కాసేపు చర్చించుకున్నాం. మేం కూడా ఇంటికి వెళ్ళిపోదామా అని. మా ఆవిడ ఎడ్వంచరస్ టైపు కాబట్టి ఆ ఆలోచన విరమించుకుని విమానం ఎక్కాం. అంతా ఫుడ్ ట్రాలీ దగ్గరికి వెళ్ళి దానిమీద పరచిన బట్టని తెరచి లోపలికి చూసి వెళ్తుండటంతో ఎయిర్ హోస్టెస్‌ని అడిగాను, అది కొత్త సంప్రదాయమా అని. ఆవిడ తల అడ్డంగా ఊపి, "కాదు. ఫుడ్ ట్రాలీలో పెట్రోల్ బాంబ్ ఉందేమోనని తనిఖీ చేస్తున్నారు. ఎందుకయినా మంచిది. మీరూ చూడండి." చెప్పింది.

అంతా తమ సీట్ల కింద, సామానుంచుకునే రేక్స్‌లో, బాత్‌రూముల్లో గబగబ వెదుకుతున్నారు, దుండగులు పెట్రోల్ బాంబుని ఇంకెక్కడయినా దాచిపెట్టారా అని.

ఎయిర్‌హోస్టెస్ విమానం తలుపు మూశాక నేను దాని దగ్గరికి వెళ్ళి లాగి తెరచి మళ్ళీ గట్టిగా మూశాను,




చిత్రాలు: పి.ఎస్. బాబు

సరిగ్గా పడిందో లేదోనని. నాలా కార్లున్న వాళ్ళంతా మిగతా తలుపులు లాగి తెరచి మళ్ళీ గట్టిగా మూశారు.

అనవసరంగా ఎయిర్‌హోస్టెస్ దగ్గరగా సీట్ ఇవ్వమన్నానే అని బాధ పడ్డాను. ఆమె 'ఎయిర్‌హోస్టెస్'లా కాక 'ఎయిర్ ఘోస్టెస్'లా కనబడింది నా కళ్ళకి. ఎయిర్‌హోస్టెస్‌లు అందంగా ఉంటారనే అభిప్రాయాన్ని తుడిచేసుకుని ఆ సంగతిని నా నోట్‌బుక్‌లో ఇలా రాసుకున్నాను.

"ఎయిర్‌హోస్టెస్‌ల కంటే ఇంటికొచ్చి బిస్కత్తులు, అగరొత్తులు అమ్మే అమ్మాయిలే బావుంటారు."

"మీరెంతదాకా?" అడిగాడు నాపక్కన కూర్చున్నతను.

"న్యూయార్క్. మీరు?" అడిగాను ఇంగ్లీషులోనే.

"నేనూ అక్కడికే. కోర్టు పనిమీద." చెప్పాడు.

"అక్కడ మంచి హోటళ్ళేమున్నాయి?" అడిగింది మా ఆవిడ.

"ఏమో. నాకు దూరపు బంధువున్నాడు. వాళ్ళింట్లో దిగుతాను." చెప్పాడు.

"విమానాలు కనిపెట్టాక దూరపు బంధువులంటూ ఎవరూ లేరు. అంతా దగ్గరి బంధువులే అవుతారు." నవ్వాను.

అతన్ని శ్రద్ధగా గమనిస్తే, ముచ్చెమటలు పట్టేసి ఉన్నాయి. అతని కళ్ళు ఓ క్షణంపాటైనా నిశ్చలంగా లేవు. అటు ఇటు భయంగా చూస్తున్నాడు. అతని ఒళ్ళో భద్రంగా ఉందో ఫస్ట్ ఎయిడ్ బాక్స్. 'నా బ్లడ్ గ్రూప్ 'ఏబి ఆర్ హెచ్ పాజిటివ్' అన్న అట్ట అతని మెళ్ళో వేలాడుతోంది. నేనది గమనించడం గమనించి, బలహీనంగా నవ్వి చెప్పాడు. "ఒకోసారి బ్లడ్ గ్రూప్ టెస్ట్ చేయడానికయ్యే ఆలస్యం చాలు మనిషి పోవడానికి."

"విమానం ఇంకా గాల్లోకి లేవకుండానే ఇంత గాబరా పడుతున్నారేమిటి?" అడిగింది మా ఆవిడ ఆయన్ని. "విమాన ప్రయాణం మీకిది మొదటిసారా?" ఎదురుప్రశ్న వేశాడు. "అవును."

"నాకు మొదటిసారి కాదు కాబట్టి." చెప్పాడు.

"పిరికిపీనుగ." చెప్పాను మా ఆవిడతో తెలుగులో. "మంచి పొరుగే" అన్నది మా ఆవిడ ముసిముసిగా నవ్వుతూ.

ఎయిర్‌హోస్టెస్ జనవరి 26న స్కూల్లో పిల్లలకు పంచినట్లుగా మా అందరికీ చాక్లెట్స్ పంచి పెట్టింది. "ఇవి దేనికి?" అడిగాను ఆమెను.

"మీ చెవులకి. విమానం ఎగిరేప్పుడు, కిందకి దిగేప్పుడు కలిగే ఒత్తిడి నుంచి మీ చెవులకి రక్షణకి." చెప్పింది.

ఆమె అటు తిరగగానే ఆ రెంటిని రెండు చెవుల్లో ఉంచుకున్నాను.

"తమాషాగా లేదూ! ఈ పద్ధతి ఎవరు కనిపెట్టారో కదండి?" అన్నది మా ఆవిడ తనూ నే చేసిన పనే చేసి.

కంట్రోల్ టవర్‌తో విమానం బయలుదేరే ముందు పైలట్ మాట్లాడిన మాటలు, పొరపాటున స్విచ్ ఆన్ చేయడంవల్లను కుంటా విమానంలో కూర్చున్న మా అందరికీ వినబడ్డాయి.

పైలట్: కంట్రోల్ టవర్. రన్‌వే మీద ఉన్న రాయి కదులుతోంది. ఓవర్.

కంట్రోల్ టవర్: అబ్బే, అది రాయి కాదు. తాబేలు. ఓవర్.

పైలట్: అండర్‌స్టుడ్. కంట్రోల్ టవర్. రన్‌వేని ఓ తాబేలు క్రాస్ చేస్తోంది. ఏం చెయ్యాలి?

కంట్రోల్ టవర్: తాబేలు ఎన్‌డేంజర్డ్ స్పీషీస్ కాబట్టి అది దాటేదాకా విమానం కదలడానికి వీల్లేదు.

పైలట్: అది దాటడానికి ఎంతసేపు పడుతుంది?

కంట్రోల్ టవర్: మావద్ద ఉన్న సమాచారం ప్రకారం గంటకి తాబేలు రెండు వందల అడుగుల వేగంతో వెళ్తుంది. దాని పోర్స్ రిపోర్ట్ చెయ్యి.

పైలట్: అది సౌత్‌వెస్ట్ వైపు వెళ్తోంది, 46 డిగ్రీల ఏంగిల్‌లో గేట్ నంబర్ ఆరు వైపు.

కంట్రోల్ టవర్: కంప్యూటర్ కాలిక్యులేషన్స్ ప్రకారం తాబేలు ఇదే వేగంతో ప్రయాణిస్తే అది తొమ్మిది నిమిషాల్లో రన్‌వే నుంచి క్లియర్ అవుతుంది.

విమానం కదలడం, ఎవడో సరిగ్గా ఆ క్షణంలో తుమ్మడం ఏకకాలంలో జరిగిపోయాయి. అంతదాకా ధైర్యంగా ఉన్న మా ఆవిడ మొహంలో క్షణకాలం అధైర్యం ప్రవేశించింది. "ఛ. నా మూడ్ అంతా పాడు చేశాడు. ఈ జలుబుగాళ్ళని విమానాల్లోకి అనుమతించకూడదు." చెప్పింది కసిగా.

చాలామంది ఆ తుమ్ము పక్షి వంక నిరసనగా చూశారు. విమానం గాల్లోకి లేచాక, ఎయిర్ ప్రెషర్ డ్రాప్ అయితే ఆక్సిజన్ మాస్కులు పైనించి మా సీట్ల మీద వేలాడతాయని, వాటిని ముక్కుకి అమర్చుకుని ఎలా గాలి పీల్చాలో ఎయిర్‌హోస్టెస్ డిమాన్‌స్ట్రేట్ చేసి చూపించింది. తర్వాత విమానం నీళ్ళలో దిగితే లైఫ్ జాకెట్‌ని మేం ఎలా ఉపయోగించాలో కూడా చూపించాక చెప్పింది:

"ఆక్సిజన్ మాస్క్‌కి పది డాలర్లు. లైఫ్ జాకెట్‌కి అయిదు డాలర్లు చెల్లించాలి. రెండూ కావాలనుకున్నవారు పద్నాలుగు డాలర్లు చెల్లిస్తే చాలు."

తర్వాత పేరాచూట్‌ని ఎలా ఉపయోగించాలో ఎయిర్‌హోస్టెస్ చెప్పింది. దాని ఖరీదు ఏభై డాలర్లు. దానికున్న తాడు లాగి ఒకటి నుంచి పది దాకా లెక్కపెట్టి, కిందకి దూకేయడమే. ఒకవేళ పేరాచూట్ పనిచేయకపోతే దాని ఖరీదు వాపసు ఇచ్చేస్తారట. అన్ని పేరాచూట్స్‌కి వారంటీలున్నాయట.

నాపక్కనున్న పిరికిపీనుగతో చెప్పాను ఒకరికొకరం ధైర్యం చెప్పుకోవాలని. "భయపడకండి."

"ఎందుకు భయపడకూడదు? ఎవరయినా రైలునో, బస్సునో పాకిస్తాన్‌కు హైజాక్ చేసి తీసుకెళ్ళడం గురించి విన్నారా?" అడిగాడు. "పాయింటేస్మి. ఇందులో హైజాకర్ ఉన్నాడంటారా?" అడిగాను నా భయాన్ని అణచుకుంటూ. "కాసేపట్లో తెలుస్తుంది..." చెప్పాడు అతను.

"విమానం మనిషిని ఓచోటి నుంచి ఇంకో చోటికి తీసుకెళ్ళే సాధనం... ఈ ప్రపంచంలోంచి ఇంకో ప్రపంచంలోకి." కొద్దిసేపాగి మళ్ళీ చెప్పాడు.

"పైగా బద్ధకస్థులయిన యమదూతలకి అందుబాటులో ఉండేది మనమే. మనల్ని పైకి తీసుకెళ్ళే ఈ ఒన్‌వే టికెట్ ఖరీదులు కూడా నింగిని చేరుకుంటున్నాయి." చెప్పాడు ఇంకాస్సేపాగి భయంగా.

"భయపడకండి. విమానం స్లోగానే వెళ్తోంది. రేష్ డ్రయివర్ కాదనుకుంటా ఆ పైలట్." ధైర్యం చెప్పింది మా ఆవిడ.

మా వెనక సీట్లోని పాపకి కూడా అదే మొదటి విమాన అనుభవం అనుకుంటా. తెగ భయపడుతోంది. ఆ పాప భయం పోగొట్టడానికి ఆ పాప తల్లి ఓ కథని విమానంలోని రొద కన్నా గట్టిగా చెప్పసాగింది. ఆ పాప భయం తగ్గాక ఆ కథని చెప్పడం ఆపిందామె మధ్యలోనే. వెంటనే పది మంది ఆసక్తిగా అడిగారు.

"పూర్తి చేయండి. రాయిగా మారిన ఆ రాజకుమారిని మళ్ళీ రాజకుమారుడు మనిషిలా ఎలా మార్చాడు?"

ఆవిడ మిగతా కథ మాకు చెప్పలేదు. ఎయిర్‌హోస్టెస్ కంఠం వినిపించింది విమానంలో.

విమాన ప్రయాణం అంటే భయం ఉన్నవారికి, మొదటిసారి విమాన ప్రయాణం చేసేవారి కోసం ప్రత్యేకంగా ఓ ప్రదర్శన.

అనేక రకాల పక్షులు ఆకాశంలో ఎత్తులో ఎగిరే ఫిలిం ప్రదర్శించారు కాసేపు. ఓ బేక్‌గ్రౌండ్ వాయిస్ చెప్పసాగింది.

"చూశారుగా. ఎగిరేవి ఏవీ కూలవు. ఏ పక్షి అయినా ఎగురుతూ కూలడం విన్నారా? లేదుగా? ఎగిరేది ఏదీ కూలదు. నిర్భయంగా ఉండండి."

విమానం ఢిల్లీ నుంచి బయలుదేరాక కొద్దిసేపటికి ఎయిర్‌హోస్టెస్ మాకు భోజనం సర్వ్ చేసింది.

తర్వాత కొద్దిసేపట్లో ఎంటర్‌టెయిన్‌మెంట్ ఉంటుందని ప్రకటించింది.

ఫస్ట్ క్లాస్ ప్రయాణికులకు సినిమా, ఎకానమీ క్లాసులో ఉన్న మాలాంటి వారికి నటీనటుల స్లయిడ్స్ వేయసాగారు. కొద్దిసేపట్లో ఫస్ట్ క్లాస్ లోంచి ఓ ప్రయాణికుడు బయటికి వచ్చాడు. "ఛ. విమాన ప్రయాణాలంటే నాకిందుకే తలనొప్పి. సినిమా బావుండకపోతే బయటికి పోలేం."

ఏం సినిమా వేస్తున్నారా అని చూస్తే ఓ చెత్త హిందీ సినిమా. "రైట్ బ్రదర్స్ విమానం కనిపెట్టకపోతే రైళ్ళలో ఇలాంటి సినిమాలు వేస్తుండేవారు." మా ఆవిడ చెప్పింది.

అకస్మాత్తుగా నా పిరికి పొరుగువాడు చెప్పాడు. "ఇలాగే ఓసారి థాయ్

అతనికి ముచ్చెమటలు పట్టేసి ఉన్నాయి. అతని కళ్ళు ఓ క్షణంపాటైనా నిశ్చలంగా లేవు. అటు ఇటు భయంగా చూస్తున్నాడు. అతని ఒళ్ళో భద్రంగా ఉందో ఫస్ట్ ఎయిడ్ బాక్స్... "పిరికిపీనుగ". చెప్పాను మా ఆవిడతో. "మంచి పొరుగే" అన్నదావిడ ముసిముసిగా నవ్వుతూ.



ఎయిర్‌లైన్స్‌లో బ్రస్సెల్స్ నుంచి బెర్లిన్‌కి వెళ్తున్నాను. పైలట్ చెప్పాడు 'ఇంజన్ నంబర్ ఒన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది కాబట్టి దాన్ని ఆపేస్తున్నాను. మనం ఇరవై నిమిషాలు లేటుగా వెళ్తాం' అని. అయిదు నిమిషాల తర్వాత 'రెండో నంబర్ ఇంజన్ కూడా ఆపేస్తున్నాను. మరేం భయం లేదు. నలభై నిమిషాలు లేటుగా వెళ్తాం' అని చెప్పాడు. మూడోసారి అనౌన్స్ చేసి 'మూడో నంబర్ ఇంజన్‌కి కూడా ట్రబుల్ వచ్చింది. గంట లేటుగా వెళ్తాం' అన్నాడు. నాలుగో నంబర్ ఇంజనుతో విమానం నడిపి గంట లేటుగా తీసుకెళ్ళాడు.

"అదీ పనిచేసి ఉండకపోతే?" అడిగాను గుండె మీద చేయి ఉంచుకుని. "ఏముంది. రాత్రంతా విమానంలోనే ఉండేవాళ్ళం." చెప్పాడు నా పొరుగువాడు నవ్వుతూ.

"వీడెక్కడ దొరికాడండి మనకి? హడలగొడుతున్నాడు." చెప్పింది మా ఆవిడ భయంగా.

కాక్‌పిట్ ఎలా ఉంటుందో చూడాలనిపించింది మా ఇద్దరికి. ఎయిర్ హెూస్టెస్‌ని అడిగితే ఏ కళ నుందో వదమని అక్కడికి తీసుకెళ్ళింది మమ్మల్నిద్దరిని.

''మమ్మల్ని జాగ్రత్తగా కిందకి దింపుతారు కదా?'' అడిగింది మా ఆవిడ.

''తప్పకుండా. ఇంతదాకా నేను ఎవర్నీ పైనే వదల్లేదు.'' సీరియస్‌గా చూస్తూ జవాబు చెప్పాడు పైలట్.

ఓరకంటితో చూస్తే మా ఆవిడ నిద్దర్లోకి జారడం గమనించాను. ఎయిర్ హెూస్టెస్‌ని పిలిచాను. ఆమె కాక్‌పిట్ లోంచి బయటికి రాగానే అడిగింది ఎప్పటిలానే నన్ను. ''యస్ సర్. వాట్ కెన్ ఐ డు ఫర్ యు?''

ఏం చెయ్యాలో చెప్పి "చాటు ప్రదేశం ఎక్కడుంది ఈ విమానంలో?" అడిగాను. నావంక కొరకొర చూసి వెళ్ళిపోయింది. పెద్ద అందగత్తె కాకపోయినా ఎందుకో ఆ టెక్కు! మాటిమాటికీ మరి 'వాట్ కెన్ ఐ డు ఫర్ యు?' అని అడగడం దేనికి?

విమానం బయలుదేరి అప్పటికే నాలుగు గంటలయింది. నాకు నిద్ర వడుతుండగా పైలట్ కంఠం వినపడింది మత్తుగా.

"లేడీస్ అండ్ జెంటిల్‌మన్. మీకో మంచి వార్త, చెడ్డ వార్త. ముందుగా చెడ్డ వార్త. విమానంలో ఓ సాంకేతిక లోపం కారణంగా దిక్సూచి, రాడార్, రేడియో ఇంకా ఇతర నేవిగేషన్ పరికరాలన్నీ పని చేయడం లేదు. దీనర్థం మనం ఎటువైపు నుంచి ఎటు వెళ్తున్నామో తెలీదు. అయినా, భయపడాల్సిన పని లేదు. పెట్రోల్ ఫుల్‌గా కొట్టించుకొచ్చాను. రిపేర్ చేస్తున్నాం. ఇప్పుడు మంచి వార్త. కొద్ది క్షణాల్లో సెక్స్ క్వీన్ మార్లిన్ మన్రో నటించిన చిత్రం 'సెవెన్ ఇయర్ ఇచ్'ని వేస్తున్నాం. ఎంత మార్లిన్ మన్రో సినిమా అయినా నిద్రను ఆపుకోలేక పోయాను. అరగంటలో మెలకువ వచ్చింది.

టాయ్‌లెట్‌లోకి వెళ్ళాను. బయటికి రాగానే ఓ వ్యక్తి నిలబడి భయంగా చేతివేళ్ళని కొరుక్కోవడం గమనించాను. గోళ్ళన్నీ కొరుక్కున్నట్లున్నాడు. అవి లేవు. అతనికి ధైర్యం చెప్పాలనిపించింది.

"ఏం భయం లేదు. విమానం సేఫ్‌గా దిగుతుంది. మన పైలట్ గట్టివాడు."

అతను మారుమాటలాడకుండా కోట్ రేక్ తెరచి హేంగర్‌కున్న తెల్లకోటు అందుకుని తొడుక్కున్నాడు. అతను మా పైలట్!

''దయచేసి కాక్‌పిట్‌కి దారి చెప్తారా?'' అడిగాడు. చూస్తే అతను తూలుతున్నాడు. జాగ్రత్తగా నడిపించుకెళ్తూ ''అమ్మాయ్ ఎయిర్‌హెూస్టెస్. కాసిని మజ్జిగ అర్జంట్‌గా తేమ్మా'' అని అరిచాను.

నేను అతన్ని కాక్‌పిట్‌లో అతని కుర్చీలో కూర్చోబెట్టగానే ఎయిర్‌హెూస్టెస్ పరిగెత్తుకొచ్చింది. ''బాగా తాగాడు.'' చెప్పాను.

''ఛ. తాగడం కాదు. మీరెళ్ళండి.'' చెప్పిందా అమ్మాయి

కొద్ది క్షణాలపాటు ఎయిర్‌హెూస్టెస్‌లంతా నేలమీద వంగొని దేనికోసమో వెదకసాగారు. మరికొద్ది క్షణాల్లో ఆ అమ్మాయి కంఠం స్పీకర్స్ లోంచి వినపడింది.

''ప్రయాణికులంతా దయచేసి వినండి. ఎవరికయినా కాంటాక్ట్ లెన్సెస్ దొరికితే వెంటనే వాటిని పైలట్‌కి అందచేయవలసిందిగా కోరుతున్నాం. అంతదాకా అంతా 'శ్రీరామ శ్రీరామ' అనుకుంటూ కూర్చోండి.''

ఓ ప్రయాణికుడు లేచి పైలట్ గదిలోకి వెళ్ళి నవ్వుతూ బయటికి రావడంతో అంతా ఊపిరి పీల్చుకుని అడిగాం. "మీకు దొరికాయా? ఇచ్చారా?''

"దొరకలేదు. నావి పైలట్‌కి సరిపోయాయి.'' చెప్పాడా ప్రయాణికుడు.

మాకు టీ ఇస్తుండగా అకస్మాత్తుగా అవతలి వరసలోంచి ఓ అమ్మాయి అరిచింది. ''ఎయిర్‌హెూస్టెస్ ... నాకు కానుపు రాబోతుంది. హెల్ప్ చెయ్యవా?''

ఆ ఎయిర్‌హెూస్టెస్ అటువైపు చూడనైనా చూడకుండా చెప్పింది.

''సారీ. అది నాకు అలాట్ చేసిన వరస కాదు.''

నా పొరుగువాడు నా భయాన్ని పెంచసాగాడు అనేక అనుభవాలు చెప్పి.

''ఓసారి ఇలాగే లాస్ ఏంజిలిస్‌కి వెళ్తుంటే విమానం సముద్రం మీద 'లేండవ'బోతోందని, ఓ అరగంట మునగకుండా తేలుతుందని, మమ్మల్ని రక్షించటానికి రెస్క్యూ బోట్స్ వస్తాయని చెప్పాడు. పైలట్ అన్నట్లుగానే విమానం నీళ్ళ మీద దిగింది. ఇరవై తొమ్మిది నిమిషాలయినా రెస్క్యూ బోట్స్ రాలే. పైలట్ చెప్పాడు మాతో 'ఈత వచ్చినవాళ్ళు ఎడం వైపుకి, రానివారు కుడివైపుకి మారండి. తర్వాత ఏం చెయ్యాలో చెబుతాను అని అలా మారాక చెప్పాడు. ఎడం వైపు వారికి- నీళ్ళు మీ మోకాళ్ళ దాకా రాగానే ఈదడం ప్రారంభించండి. కుడివైపు వారికి 'థాంక్ యు ఫర్ ఫ్లయింగ్ విత్ ఎయిర్ ఇండియా.''

నాపక్కతను చెప్పాడు. ''ఓసారి నేను హాంకాంగ్ నుంచి టోక్యోకి విమానంలో వెళ్తుంటే సింగపూర్ పోలీసులు నన్ను అరెస్టు చేశారు.''

''సింగపూర్ పోలీసులు హాంకాంగ్ నుంచి టోక్యోకి విమానంలోకి ఎలా వచ్చారు?'' అడిగాను ఆశ్చర్యంగా.

''వాళ్ళు విమానంలోకి రాలేదు. మా విమానం సింగపూర్‌లో కూలితే నేను ఓ లాన్ మీదకి వెళ్ళి వడ్డాను. 'కీప్ అఫ్ ది గ్రాస్' అన్న సైన్ ఆ లాన్ బయట ఉంది. దాంతో గడ్డి మీదున్నందుకు వాళ్ళు అరెస్టు చేశారు.'' చెప్పాడు.

"విమానం కూలడం గురించి మనం కొద్దిసేపు మాటాడకుండా ఉందామా?" అడిగాను భయంతో కూడిన కోపంతో. 'ఈయన ఎక్కిన ప్రతి విమానం కూలుతుంది' అన్న నమ్మకం కలగసాగింది. ఓ కుర్రాడు 'కారెక్కుదాం, కారెక్కుదాం' అని అదే పనిగా గొడవ చేస్తూంటే ఆ పిల్లాడి తల్లిదండ్రులు ఏం చేయలేక నిస్సహాయంగా చూడసాగారు. ఎయిర్‌హెూస్టెస్ ఆ పిల్లవాణ్ణి గట్టిగా మందలించింది. ''గొడవ చేస్తే బయటికి పంపించేస్తాను జాగ్రత్త''

''ఆ ఎయిర్‌హెూస్టెస్ పేరు నమ్రతాసింగ్‌ట. చేరి ఏణ్ణర్థం అయిందట. ఇంతకు మునువు కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేసేదిట. విడాకుల కేసు కోర్టులో నడుస్తోందిట. భర్త తాగుబోతట. వాడు ఇంజనీర్‌ట..'' ఎక్కడికెళ్ళినా సరే పక్కవాళ్ళ గురించి ఇట్టే తెలుసుకోగలదు మా ఆవిడ.

నగం దూరం ప్రయాణం చేశాం. అకస్మాత్తుగా ఓ ఎయిర్‌హెూస్టెస్ చెప్పింది.

''లండన్‌లో దిగే ప్రయాణికులు చేతులెత్తండి.''

ఓ వద్నాలుగు మంది చేతులెత్తారు. వాళ్ళని విమానం తలుపు దగ్గరికి రమ్మని, అందరి దగ్గర తలో ఏభై డాలర్లు తీసుకుని వాళ్ళ వీపులకు పేరాచూట్‌లని కట్టి చెప్పారు.


"అది విరగకుండా న్యూలాండ్ స్ట్రీట్‌లోని ఎయిర్ ఇండియా ఆఫీసులో ఇస్తే పాతిక డాలర్లు వెనక్కి ఇస్తారు. ఇవి పనిచేయకపోతే ఏభై డాలర్లు వాపసు ఇస్తారు."

ఆ అడ్రసున్న ప్రింటెడ్ కార్డులు అందరికి ఇచ్చి, కిందకి దూకాక ఏ తాడు లాగాలో అది వాళ్ళ చేతికందించి 'ఒన్ - టు - త్రి - జంప్' అనసాగారు ఎయిర్‌హెూస్టెస్‌లు. ఒక్కొక్కరు దూకేదాకా అలా అంటూనే ఉన్నారు. తమ చేతుల్లో ఎయిర్ బేగ్‌లతో అంతా దూకాక 'ఎయిర్ ఇండియాలో ప్రయాణించినందుకు థాంక్స్' అని బయటికి అరిచి విమానం తలుపు మూసేసి గడియ పెట్టారు. ''ఎవరు వాళ్ళు?'' అడిగాను ఆశ్చర్యంగా.

"దారిలో లండన్‌లో దిగాల్సిన ప్రయాణికులు. గల్ఫ్ సంక్షోభం, రూపాయి విలువ తగ్గడం, ఫారిన్ ఫండ్స్ కొరత వల్ల విమానంలో కనీసం నగం మంది దిగితే తప్ప దారిలో ఆపకూడదన్న కొత్త డైరెక్టివ్ వచ్చింది సెంట్రల్ గవర్నమెంట్ నుంచి. కిందకి దిగి మళ్ళా ఎగరాలంటే చాలా ఫ్యూయల్ ఖర్చవుతుంది. వాళ్ళ బోడి టికెట్ల ఖరీదు కూడా గిట్టుబాటు కాదు కాబట్టి ఈ వద్ధతి. సరిగ్గా లండన్‌లో ఎవరే పేటకి వెళ్ళాలో అక్కడ పడేలా దూకించాం కాబట్టి టాక్సీ ఖర్చు కూడా ఉండదు." చెప్పింది ఎయిర్‌హెూస్టెస్.

నా పొరుగువాడు మళ్ళీ నోరు విప్పాడు. ''నన్నడిగితే విమానాలని కనిపెట్టడం వల్ల సుఖపడేది ఇందులో ప్రయాణించే వారు కాదు. ఎయిర్ మెయిల్ లెటర్స్ రాసే వాళ్ళు బాంబే నుంచి న్యూయార్క్‌కి

ఆ విధంగా నే పనిచేసే కంపెనీ పదేళ్ళకోసారి నాకిచ్చే ఫారిన్ ట్రావెల్ కన్సెషన్ టికెట్లతో నా భార్య స్థానంలో నేను నా 'గర్ల్ ఫ్రెండ్' ని తీసుకెళ్ళడం బయట పడింది. మా ఆవిడకు, నాకు విడాకులు మంజూరు అయ్యాయి.



వాళ్ళ లెటర్స్ నాలుగు రోజుల్లో చేరుకుంటాయి... ముఖ్యంగా లండన్‌కి చేరాల్సినవి."

పేరాచూట్‌లు కట్టుకోసాగారు ఎయిర్‌హొస్టెస్‌లు కూడా.

"మీరెక్కడికి?" అడిగాను విభ్రాంతిగా.

"మరేం లేదు. ఇంకాసేపట్లో మన విమానం దిగబోతుంది. ఒకోసారి లాండింగ్‌లో ప్రాబ్లం అవుతుంది. అందుకు సిద్ధంగా ఉండాలని." చెప్పిందామె.

నా పక్కాయన చెప్పాడు మెల్లిగా. "ఇంతదాకా 'నా పేరాచూట్ తెరుచుకోలేదు' అని నోరు తెరిచి ఫిర్యాదు చేసినవాడు లేడంటే నమ్మండి."

"ఫిర్యాదు చేయడానికి వాడు బతికుంటేగా?" చెప్పాను నవ్వి.

"ఎప్పటికీ గుర్తుంచుకోండి. 'దేవుడి మీద నమ్మకం ఉందా' అని పైలట్ కాని, ఎయిర్‌హొస్టెస్ కాని అడిగితే లేదని చెప్పండి." చెప్పాడు నా పొరుగు వాడు అకస్మాత్తుగా, రహస్యం చెబుతున్నట్లుగా.

"ఏం? అడిగాను. "నేనోసారి లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌లో ప్రయాణిస్తుంటే మా విమానం జెనీవాకి చేరబోతుండగా ఆ ప్రశ్నని అందరినీ అడిగిందో ఎయిర్ హొస్టెస్. ఓ మతాధికారి 'నాకు దేవుడి మీద నమ్మకం ఉంది' అన్నాడు. వెంటనే ఎయిర్‌హొస్టెస్ ఆయనకి తప్ప అందరికీ పేరాచూట్‌లిచ్చి చెప్పింది ఆ మతాధికారితో 'విమానం ఆల్ప్స్ పర్వతాల్లో కూలబోతుంది. మా దగ్గర ఓ పేరాచూట్ తక్కువగా ఉంది. మీరు దేవుణ్ణి ప్రార్థించండి" అని.

"విమానం కూలే విషయాలు తప్ప ఇంకేం లేవా లోకంలో?" అని మా ఆవిడ కోపంగా అడిగింది అతన్ని గొంతు పెంచి.

"ఇంక దేని గురించి మాట్లాడను?" అడిగాడు అతను.

"ఏదో ఒకటి. దొంగతనం గురించి." చెప్పాను నోటికి వచ్చింది.

కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడాయన.

"ఈ విమానాల వల్ల ఓ అసౌకర్యం ఉంది. ఉదయం బాంబేలో, మధ్యాహ్నం సింగపూర్‌లో, రాత్రి టోక్యోలో దొంగలు కత్తి చూపించి ఒకే వ్యక్తి దగ్గరనుంచి దోచుకోవచ్చు - ఆ విమానం మధ్యలో కూలకుండా సేఫ్‌గా లేండయితే."

ఆ నిరాశావాదితో మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాను. అంతేకాదు. ఇంకెప్పుడు విమాన ప్రయాణం చేయాల్సిన అవసరం ఏర్పడ్డా, నా సీటుకి అటు, ఇటు రెండు సీట్లు ఖాళీగా ఉండేలా అదనంగా రెండు టికెట్లు కొనాలని ఒట్టు పెట్టుకున్నాను. మా విమానం కొద్దిసేపట్లో న్యూయార్క్‌లోని జె.ఎఫ్.కె. ఎయిర్ పోర్ట్‌లో దిగబోతోందని, అయితే, విమానాశ్రయం బిజీగా ఉండటంతో 'హోల్డింగ్ పేట్రన్' ప్రకారం మా వంతు వచ్చినప్పుడు రన్‌వే మీద దిగుతుందని, అంతదాకా న్యూయార్క్ నగరం మీద చక్కర్లు కొడుతుందని, కాలక్షేపానికి 'మేరా నామ్ జోకర్' సినిమా వేస్తామని ఎయిర్‌హొస్టెస్ చెప్పింది.

మేరా నామ్ జోకర్!

ఆ సినిమా మధ్యలో ఉండగా చెప్పింది ఎయిర్‌హొస్టెస్.

"యువర్ అటెన్షన్ ప్లీజ్. దిగడానికి మన వంతు వచ్చింది. కానీ, కొందరు ప్రయాణికుల రిక్వెస్ట్‌ని అనుసరించి ఈ సినిమా పూర్తయ్యేదాకా మనం ఎగరొచ్చా అని పైలట్ ఎయిర్‌పోర్ట్ అధికారులని అడిగారు. కుదరదని, వెంటనే దిగమని వారు కోరడంతో మనం కొద్దిసేపట్లో ... ఐ మీన్ మన విమానం కొద్దిసేపట్లో న్యూయార్క్‌లోని జె.ఎఫ్.కె. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతుంది. మీరంతా మీ మీ ఛేస్టిటీ బెల్ట్స్ కట్టుకోవలసిందిగా కోరుతున్నాను."

ఎయిర్‌హొస్టెస్‌ని పిలిచి అడిగాను, "ఎయిర్ డ్రైవర్‌కి ఇచ్చిన చాక్లెట్లు ఇక చెవుల్లోంచి తీయొచ్చా" అని.

"అరెరె! అవి చెవుల్లోకి కావు. తినడానికి." నొచ్చుకుంటూ రెండు చెవుల్లోంచి రెండు తీసి, విప్పి ఒకటి నాకిచ్చి ఇంకోటి తను నోట్లో వేసుకుని వెళ్ళిపోయింది.

"ఈ విమాన ప్రయాణం వల్ల నాకోటి తెలిసిందండోయ్. డిన్నర్ ఢిల్లీలో, అజీర్తి వ్యాధి లండన్‌లో, కడుపు నొప్పి న్యూయార్క్‌లో తెచ్చుకోవచ్చు." చెప్పింది మా ఆవిడ కడుపు చేత్తో పట్టుకుని.

విమానానికి మెట్లు అమర్చాక ఇరవై గంటల పాటు విశ్రాంతిగా కూర్చున్న వాళ్ళంతా కొన్ని క్షణాల ఆలస్యాన్ని భరించలేనట్లుగా తోసుకుంటూ దిగసాగారు.

నమస్కారం పెడుతూ నించున్న ఎయిర్ హొస్టెస్‌తో చెప్పాను.

"థాంక్స్. ఈ రెండు విమాన ప్రయాణాలని బాగా ఎంజాయ్ చేశాను."

"ఇది రెండు కాదే! ఒక్కటే విమాన ప్రయాణం." చెప్పిందామె ఆశ్చర్యంగా చూస్తూ."కాదు. రెండు. నా మొదటిది, ఆఖరిది." వివరించాను.

మెట్ల మీంచి దిగుతూ చెప్పాడు నా పొరుగువాడు.

"ఇంతదాకా నేనెక్కిన విమానాల్లో మొదటిసారిగా సేఫ్‌గా దిగి...."

ఠక్కున కాలు జారి పై మెట్టు మీంచి కింద మెట్టు మీదికి దొర్లుకుంటూ వెళ్ళాడాయన. తర్వాత లేచి కుంటుకుంటూ కోచ్ ఎక్కాడు. ఎయిర్‌పోర్ట్ ఎరైవల్స్ లాంజ్ బిజీగా ఉండటంతో విమానాశ్రయం చుట్టూ చక్కర్లు కొట్టసాగింది మా కోచ్. అనుభవజ్ఞులైన ప్రయాణికులంతా ముక్త కంఠంతో ప్రాక్టీస్ చేయసాగారు.

"ఐ హేవ్ నథింగ్ టు డిక్లేర్ ... ఐ హేవ్ నథింగ్ టు డిక్లేర్ ... ఐ హేవ్..."

క్లియరెన్స్ వచ్చాక కోచ్ ఆగింది. లోపలికి నడిచాం. కొత్తగా పెళ్ళయి హనీమూన్‌కి వచ్చిన వాళ్ళని అడిగాడు ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్ టికెట్‌లోని తేదీని చూసి.

"ఏమిటి? మూడు రోజుల క్రితం రావాలిగా మీరు?"

"అది నిజమే. కానీ, విమానంలోని ప్రొజెక్టర్ పాడవడం వల్ల దాన్ని రిపేర్ చేయడానికి టైం పట్టడంతో, 'ఇదిగో అవుతుంది, అదిగో అవుతుంది' అంటుంటే, మా హనీమూన్‌లోని మొదటి మూడు రాత్రులు బాంబే ఎయిర్ పోర్ట్‌లో గడిపాం. మిగిలిన నాలుగు రాత్రులు షికాగోలో గడిపి వెళతాం. షికాగో విమానం ఇప్పుడుందిగా?"

అతను వాళ్ళవంక సీరియస్‌గా చూస్తూ చెప్పాడు.

"ఓ సంగతి గుర్తుంచుకోండి. మీరు వచ్చిన విమానం కరెక్ట్ టైంకి వస్తే మీ కనెక్టింగ్ ఫ్లయిట్ లేటవుతుంది. మీ విమానం లేటయితే మీ కనెక్టింగ్ ఫ్లయిట్ టైంకి వెళ్ళిపోతుంది. అలాగే వెళ్ళిపోయింది. ఈ రాత్రి న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో గడిపి రేపు ఉదయం షికాగోకి వెళ్ళురుగాని."

ఎయిర్ పోర్ట్ ఫార్మాలిటీస్ ముగించుకుని బయటకు వచ్చాక కాని నా గుండె కుదుటపడలేదు.

సామాను కోసం కన్వేయర్ బెల్ట్ దగ్గర వెయిట్ చేయసాగాను.

అందరి సూట్‌కేసులు వచ్చాయి కాని మాది రాలేదు. ఓ అధికారి దగ్గరికి వెళ్ళి సంగతి చెప్తే నా బేగేజ్ టేగ్ అడిగి తీసుకుని పరిశీలించి చెప్పాడు కోపంగా.

"మీరు పారిస్‌కి టికెట్ కొని న్యూయార్క్‌కి ఎందుకొచ్చారు?"

"నేను టికెట్ కొన్నది న్యూయార్క్‌కే."

"మరి బేగేజ్ పారిస్‌కి ఎందుకు బుక్ చేశారు?"

జేబులోంచి తీసి టికెట్ చూపించాను.

"మీరు సిలోనీసా?" అడిగాడతను, నా ఒంటి రంగు చూసి.

"కాదు. ఇండియన్." చెప్పాను.

"అయితే, మీరీ సంగతి తెలుసుకోవాలి. క్రిస్టఫర్ కొలంబస్ రోజులు కావివి. కొలంబస్ ఇండియాకి బయలుదేరి సేన్‌సల్వేడర్‌కి చేరుకున్నాడు, అదే ఇండియా అనుకుని. కానీ, ఈ రోజుల్లో మీరు ఇండియాకి బయలుదేరి, ఇండియాకే చేరుకుంటారు. కానీ, మీ లగేజ్ మాత్రం సేన్‌సల్వేడర్ చేరుకుంటుంది." చెప్పాడతను నవ్వుతూ.

"సారీ. మీరు హాలిడేకి న్యూయార్క్‌కి వస్తే మీ లగేజ్ పారిస్‌కి వెళ్ళింది. మీ చిరునామా ఇస్తే తెప్పించి మీకు అందచేసే ఏర్పాటు చేస్తాను." అతని పక్కతను చెప్పాడు.

ఆ విమాన ప్రయాణం అయ్యాక మళ్ళీ విమానం ఎక్కితే ఒట్టు. అమెరికా నుంచి ఓడలో తిరిగి ఇండియా వచ్చేశాం.

ఓ రెండు నెలలకి ఆ విమాన ప్రయాణం నా కొంప ముంచింది. నేను ఆఫీసు పని మీద బెంగుళూరు వెళ్ళినప్పుడు ఎయిర్ ఇండియా నుంచి ఓ ఉత్తరం మా ఇంటికొచ్చింది.

అందులో, "మీరు, మీవారు కలసి వేసవి సెలవలకి బాంబే నుంచి న్యూయార్క్‌కి మా విమానంలో ప్రయాణం చేసినందుకు కృతజ్ఞులం. ఇక ముందు కూడా మీరు మమ్మల్నే ఆదరిస్తారని ఆశిస్తున్నాం" అంటూ ఓ గ్రీటింగ్ కార్డు జత చేశారు.

అది చదివిన నా భార్య, నేను తిరిగి వచ్చేసరికి కత్రుచ్చుకుని కూర్చునుంది.

"నేను న్యూయార్క్‌కి ఎప్పుడెళ్ళాను?" అరిచింది, ఆ ఉత్తరం చూపించి.

ఆ విధంగా నే పనిచేసే కంపెనీ పదేళ్ళ కోసారి నాకిచ్చే ఫారిన్ ట్రావెల్ కన్సెషన్ టికెట్లతో నా భార్య స్థానంలో నేను నా 'గర్ల్ ఫ్రెండ్'ని తీసుకెళ్ళడం సంగతి బయటపడింది. మా ఆవిడకు, నాకు విడాకులు మంజూరు అయ్యాయి.

ఇదే రైల్లో ప్రయాణం చేస్తే అలాంటి లెటర్ పంపేవారా? మీరే చెప్పండి. ■

(కేవలం సహజత్వం కోసం 'ఎయిర్ ఇండియా' పేరును ఈ ఫిక్షన్‌లో వాడుకోవడం జరిగిందని పాఠకులు గమనించ ప్రార్థన. — రచయిత)

